## ప్రభువైన యేసు మోక్షారోహణము

*అపొస్తలుల కార్యములు 1,1-11; ఎఫెసీయులకు 1,17-23; మత్తయి 28,16-20*

### ప్రారంభ పలుకులు

కొన్ని సంవత్సరాల క్రితం, ఒక చిన్న పాప తన చేతిలో కాగితపు విమానం పట్టుకొని ఆట స్థలంలో నిలబడింది. అది ఎంత దూరం వెళ్లగలదో అంత దూరం ఎగరాలని ఆమె కోరుకుంది. తన శక్తినంతా ఉపయోగించి దానిని గాల్లోకి విసిరింది. ఒక క్షణం అది ఎగురుతూ కనిపించింది—తర్వాత కనబడకుండా పోయింది. నిరాశతో అది కిందపడిపోయిందని ఆమె అనుకుంది. కానీ ఆమె గురువు మృదువుగా చెప్పింది: "కాదు, అది ఇంకా ఎగురుతోంది. నీకు ఇక కనిపించదు అంతే, కానీ దాని ప్రయాణం ఇప్పుడే మొదలైంది."

ఈ రోజు మనం యేసు ప్రభువు మోక్షారోహణ మహోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఆ కాగితపు విమానం లాగానే, యేసు మన కళ్లకు కనబడకుండా పోవడం ఒక వీడ్కోలు కాదు; అది ఒక దౌత్యానికి ఆరంభం—మనలో ప్రతి ఒక్కరిలో కొనసాగుతున్న ఒక దౌత్యం. ఆయన పునరుత్థానమైన నలభై రోజుల తరువాత, యేసు తన శిష్యులకు ప్రత్యక్షమయ్యాడు. వారికి బోధించాడు, మార్గనిర్దేశం చేశాడు, దేవుని రాజ్యపు వాస్తవాన్ని చూపించాడు. తరువాత ఆయన పరలోకానికి ఎత్తబడినాడు—వారిని ఒంటరిగా విడిచి పెట్టకుండా, తన సందేశాన్ని భూమి చివరలవరకు తీసుకెళ్లుటకు పవిత్రాత్మ శక్తిని వారికి ప్రసాదించాడు.

మన మధ్య సజీవంగా, సన్నిధిగా ఉన్న క్రీస్తుకు మన హృదయాలను తెరవుదాం. ఆయనను అనుసరించుటకు, ఆయన ప్రేమకు సాక్షులుగా ఉండుటకు, ఆయన రాజ్యానందాన్ని మన ఇళ్లలో, మన సంఘాలలో, మన ప్రపంచంలో పంచుకొనుటకు ఆయన మనలను పిలుస్తున్నాడు.

## ప్రసంగం: మోక్షారోహణం – దౌత్యం, సన్నిధి మరియు ఆనందానికి ఆరంభం

కొన్ని సంవత్సరాల క్రితం, ఒక చిన్న పాప తన చేతిలో కాగితపు విమానం పట్టుకొని ఆట స్థలంలో నిలబడింది. అది ఎంత దూరం వెళ్లగలదో అంత దూరం ఎగరాలని ఆమె కోరుకుంది. తన శక్తినంతా ఉపయోగించి దానిని గాల్లోకి విసిరింది. అది కొంతసేపు ఎగురుతూ కనిపించింది—తర్వాత కనబడకుండా పోయింది. నిరాశతో అది కిందపడిపోయిందని ఆమె అనుకుంది. ఆమె గురువు ఆమె పక్కన మోకాళ్లపై కూర్చొని చెప్పింది: “కాదు, అది ఇంకా ఎగురుతోంది. నీకు ఇక కనిపించదు అంతే, కానీ దాని ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది.” ఆ క్షణం యేసు ఆకాశారోహణ రహస్యాన్ని అద్భుతంగా తెలియజేస్తుంది. అంతమైందనిపించే క్షణం—యేసు కనబడకుండా పోయిన క్షణం—అసలు మరింత గొప్ప ఆరంభం.

ఈస్టరు తరువాత నలభై రోజులకుపైగా, ఆ మొదటి మోక్షారోహణ ఉదయం, శిష్యులు ఒలీవుల కొండపై నిలబడి ఆకాశం వైపు చూస్తూ ఉన్నారు. పునరుత్థానమైన క్రీస్తును వారు వారాల తరబడి చూశారు: ఆయనను చూసారు, ఆయన మాటలు విన్నారు, ఆయనతో నడిచారు, ఆయన సన్నిధి వారికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇప్పుడు అయితే, ఆయన వారి కళ్లముందు నుండి తండ్రి యొద్దకు ఎత్తబడినాడు. వారి హృదయాలలో ఆశ్చర్యం, అయోమయం, ఆతురత—**అందరు**

కలిసి ఉండి ఉండవచ్చు. ఆ అద్భుత క్షణంలో ఒక సవాలు మరియు ఒక వాగ్దానం వినిపించింది: “మీరు ఎందుకు ఆకాశం వైపు చూస్తూ నిలబడ్డారు? ఈ యేసు మళ్లీ రానున్నాడు. కానీ మీరు భూమి చివరలవరకు నా సాక్షులై ఉండాలి.”

యేసు మోక్షారోహణం మనకు మూడు లోతైన సత్యాలను బోధిస్తుంది.

మొదటిది, ఇది ఒక దౌత్యానికి ఆరంభం. ఆ చిన్న కాగితపు విమానం తన ప్రయాణాన్ని కొనసాగించినట్లే, యేసు భూమిని విడిచినప్పుడు ఆయన కథ ముగియలేదు. లూకా సువార్త అపొస్తలుల కార్యములలో కొనసాగుతుంది, మోక్షారోహణం దేవుని రాజ్యాన్ని వ్యాప్తి చేయుటకు ఒక ప్రారంభ వేదికగా నిలుస్తుందని చూపిస్తుంది. శిష్యులు ఉపన్యాసకులుగా కాక,

సాక్షులుగా పంపబడ్డారు—పునరుత్థానమైన క్రీస్తును చూసిన, తాకిన, ఆయనతో జీవించిన వారిగా. ఈరోజు అనేక క్రైస్తవులు మౌనంగా ఉంటారు; వారు ఆసక్తి లేనందుకు కాదు, కానీ దేవుని వ్యక్తిగతంగా అనుభవించకపోవడం వల్ల. మన పని ఏమిటంటే, క్రీస్తుతో మన సన్నిధి అంత స్పష్టంగా, అంత జీవంగా ఉండాలి, ఇతరులు గమనించకుండా ఉండలేరు. ఒక సంఘ సభ్యురాలు తన అనారోగ్య తండ్రి కోసం ప్రతిరోజూ ప్రార్థించేది. ఒక ఉదయం అతని ఆరోగ్యం ఆశ్చర్యకరంగా మెరుగుపడింది. అది యాదృచ్ఛికం కాదు—దేవుడు నిత్యజీవితంలో పనిచేస్తున్నాడు. లేదా ఒక యువజన సమూహం సంఘ కార్యక్రమం ఏర్పాటు చేయాలని ప్రయత్నించినప్పుడు మొదట ఏదీ సరిగ్గా జరగలేదు. తరువాత వారు కలిసి ప్రార్థించారు, తమ ప్రణాళికలో పవిత్రాత్మను ఆహ్వానించారు. అప్పుడు ఆలోచనలు వచ్చాయి, ప్రజలు చేరారు, అసాధ్యంగా కనిపించినది ఆనందకర విజయంగా మారింది. మోక్షారోహణం మనకు గుర్తుచేస్తుంది: దేవుని శక్తి లేకుండా దౌత్యం బలహీనపడవచ్చు; కానీ ఆయన ఆత్మతో చిన్న కార్యాలే ప్రపంచాన్ని మారుస్తాయి.

రెండవది, మోక్షారోహణం ధైర్యానికి మరియు సన్నిధికి పిలుపు. శిష్యులు విడిచిపెట్టబడలేదు; దేవుని రాజ్యానికి సాక్షులుగా ఉండే బాధ్యత వారికి అప్పగించబడింది. యేసు స్థలం కాల పరిమితులను దాటి, ఆత్మ ద్వారా, సంఘం ద్వారా, ఆయనను అనుసరించే మనలో ప్రతి ఒక్కరిలో సన్నిధిగా ఉంటాడు. తన నగరంలోని పేదరికాన్ని చూసి భయపడిన ఒక యువ స్వచ్ఛంద సేవకురాలు, క్రీస్తు రాజ్యాధికారాన్ని గుర్తుచేసుకొని, తన పరిసర ప్రాంతంలోని కొంతమంది పిల్లలకు సహాయం చేయడం ప్రారంభించింది. చిన్న చర్యలు ఒక చైతన్యభరితమైన సమాజ కార్యక్రమంగా మారాయి. మహిమపరచబడిన క్రీస్తును చూస్తే, ప్రపంచం చీకటిగా ఉన్నప్పటికీ మనకు కార్యాచరణకు ధైర్యం కలుగుతుంది.

మూడవది, మోక్షారోహణం మనకు దృష్టికోణం మరియు ఆశను ఇస్తుంది. యేసు సర్వసృష్టిపై రాజ్యాధికారం కలిగియున్నాడు. “ఆకాశమందు భూమిమీద సమస్త

అధికారమును నాకు అప్పగించబడెను. యుగాంతము వరకు నేను మీతోనే ఉన్నాను." యుద్ధాలు, అన్యాయం, వాతావరణ సంక్షోభాల మధ్య కూడా, క్రీస్తు విజయము ఇప్పటికే నిశ్చయమైందని మనం గుర్తుచేసుకుంటాము. ఒక పరిషత్ సమావేశం ఉద్రిక్తంగా సాగుతున్నప్పుడు, ఒక వృద్ధ యాజకుడు నిశ్శబ్దంగా ప్రార్థించి, క్రీస్తు రాజ్యాధికారంపై మనస్సు నిలిపాడు. కొద్ది నిమిషాలలో ఉద్రిక్తతలు తగ్గిపోయాయి, పరిష్కారాలు కనిపించాయి. స్తుతి, సహనం, విశ్వాసం ద్వారా దేవుని శక్తి పనిచేస్తుంది.

అయితే పరలోకం ఎక్కడ? ఒక చిన్నారి ఇచ్చిన సమాధానం మనకు సూచన ఇస్తుంది. తన చెల్లెలు పరలోకంలో ఉందని చెప్పినప్పుడు, మూడు సంవత్సరాల పాప చెప్పింది: "అయితే ఆమె ఇప్పుడు ఎప్పుడూ యేసుతో ఆడుకుంటుంది కదా!" పరలోకం మేఘాలలో దూరంగా ఉన్న స్థలం మాత్రమే కాదు. అది దేవునితో ఏకత్వం, ఆనందం, మహిమ. క్రీస్తు స్తుతింపబడే చోట, ప్రేమ పంచబడే చోట, ఆయన ఆత్మలో ప్రజలు పనిచేసే చోట పరలోకం ఉంటుంది. ప్రతి దయా కార్యం, ప్రతి కరుణ క్షణం, ప్రతి క్షమాభావం—మన లోకంలో పరలోకపు ఒక భాగాన్ని తెస్తాయి.

ఆకాశారోహణం క్రీస్తు అడుగుజాడల్లో నడవమనే ఆహ్వానం కూడా. ఒలీవుల కొండపై ఒక యాత్రికుడు రాతిలో కనిపించిన మందమైన అడుగుజాడలను చూసి, అవే యేసు భూమిపై వేసిన చివరి అడుగులేమో అని ఆశ్చర్యపోయాడు. అవే కావొచ్చు, కాకపోవచ్చు. కానీ ఆహ్వానం స్పష్టంగా ఉంది: ఆయనను అనుసరించండి. ఆకాశారోహణం యేసు ఎగిరిపోయిన దృశ్యాన్ని చూడటం కాదు; ఆయన అడుగుజాడల్లో ధైర్యంగా నడవటం—మన ఇళ్లలో, కార్యాలయాలలో, వీధులలో సేవ, న్యాయం, ప్రేమ, కరుణ ద్వారా జీవించడం. ప్రతి చిన్న ప్రేమ కార్యం ఆయన ప్రయాణానికి ఒక గుర్తు.

ఒక ఉపాధ్యాయురాలు తన విద్యార్థులను వృద్ధాశ్రమాలలో ఒంటరిగా ఉన్నవారికి లేఖలు రాయమని ప్రోత్సహించింది. ఒక యువతి ప్రతి వారం ఒక ఆశ్రయ కేంద్రానికి ఆహారం తీసుకెళ్లింది. డబ్లిన్‌లోని ఒక సదస్సు కేంద్రం ప్రపంచవ్యాప్తంగా సువార్తను ప్రకటించబోయే యాజకులను

శిక్షణ ఇచ్చింది. ప్రతి కార్యం, ప్రతి శిష్యుడు, ప్రతి సాక్షి— క్రీస్తు సన్నిధిని విస్తరింపజేస్తున్నారు, ఆయన సంఘానికి అప్పగించిన దౌత్యాన్ని కొనసాగిస్తున్నారు.

చివరగా, ఆకాశారోహణం తండ్రి మార్గదర్శక హస్తాన్ని మనకు గుర్తుచేస్తుంది. యేసు తండ్రి యొద్దకు తిరిగిపోయినా, “నేను ఎల్లప్పుడూ మీతోనే ఉన్నాను” అనే వాగ్దానాన్ని మనకు ఇచ్చాడు. తల్లిదండ్రులు తమ పిల్లలను అభివృద్ధి చెందుటకు విడిచిపెట్టినట్లే, క్రీస్తు ఆకాశారోహణం పవిత్రాత్మ ద్వారా విశ్వవ్యాప్త సన్నిధికి ద్వారమైయుంది. విడిపోవుట బాధాకరమైనదైనా, అది కొత్త జీవితం, దేవునిని కొత్త రీతిలో అనుభవించుట, కొత్త దౌత్యానికి ద్వారం.

కాబట్టి, ఆ కాగితపు విమానాన్ని చూస్తున్న చిన్న పాపలాగా మనం కూడా మన కళ్లను, హృదయాలను, ఆత్మలను పైకెత్తుదాం. ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. పవిత్రాత్మ శక్తితో నిండిన సాక్షులమై, క్రీస్తు అడుగుజాడల్లో నడుస్తూ, ప్రేమ, ఆశ, ఆనంద కార్యాల ద్వారా పరలోకాన్ని భూమికి తెచ్చుదాం. ధైర్యంగా ఉండుదాం, ఎందుకంటే ఆకాశారోహితుడైన క్రీస్తు యుగాంతము వరకు మనతోనే ఉన్నాడు.

మరొక కథతో ముగించదలిచాను. ఒక యువతి యెరూషలేములో రాతిపై కనిపించిన మందమైన అడుగుజాడల ముందు నిలబడి, యేసును అనుసరించడం జీవితపు రద్దీ మధ్య అసాధ్యమేమో అని సందేహించింది. కానీ ఆమె వీధులలో, ఒలీవ తోటలలో నడుస్తూ, ప్రతి చోట దేవుని చిన్న గుర్తులను చూసింది: ఒక స్నేహపూర్వకమైన చిరునవ్వు, సహాయక హస్తం, ఒక చిన్న ప్రార్థన క్షణం.

**Translated by: Rev. Fr. Francis Theetla,**
**Parish Priest of Paidikaluva, Cuddapah**